క్లుప్తంగా

పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఉపాధ్యాయులకు లిక్విడ్ కిట్లను అందజేస్తున్న ఎంఈఓ కె.నాగేశప్ప

కోసిగి: తరగతి గదులతో పాటు టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ కె.నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన క్లీనింగ్ లిక్విడ్ కిట్లను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు 226 లిక్విడ్ బాక్స్ కేటాయించారని చెప్పారు. ఒక్కో బాక్స్ 5లీటర్ల చొప్పున రెండేసి ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వాటిని పాఠశాలల్లో వినియోగించాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని సెంట్రల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. బుధవారం ఎన్‌సీసీ దినోత్సవం పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాల అవరణలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఎన్‌సీసీ విద్యార్థులు కళాశాల అవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. పూర్వ ఎన్‌సీసీ అధికారులు అయ్యప్ప, ప్రకాశ్‌రావు ప్రస్తుత అధికారి గోవిందు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: ఆదోని సెబ్ పరిధిలోని కుంటనహాల్–బదినేహాల్ గ్రామ రహదారిలోని ఎల్లెల్సీ కెనాల్ వద్ద బుధవారం బదినేహాల్ గ్రామానికి చెందిన వై.రామన్న, రామాంజి అనే ఇద్దరు మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారి వద్ద మోటార్‌సైకిల్, ఆరు కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ, సిబ్బంది, ఎస్ఐ శివప్రసాద్ ఉన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

ఆదోని సెంట్రల్: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. బుధవారం పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున అద్వర్యంలో ఎమ్మిగనూర్ సర్కిల్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నాడు – నేడు కింద చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నాయకులు నరేష్, మహేష్,హరి, సునీల్ పాల్గొన్నారు.

నేడు కనకదాసు జయంతి

కౌతాళం: కురుబ కులస్తుల కులదైవమైన శ్రీ భక్త కనకదాసు 536వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహిస్తామని మండల కురుబ సంఘం అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బంటకుంట గ్రామంలో నూతనంగా తయారు చేయించిన కనకదాసు చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఇందుకు మండలంలోని కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల బాలికలకు గత రెండు రోజులుగా ఆర్‌పీఎస్‌ఎఫ్, ఆర్‌యూఎస్‌ఎఫ్‌లు సంయుక్తంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్థానిక వైష్ణవి జూనియర్ కళాశాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు 30 పాయింట్ల తేడాతో గెలుపొందారు. విద్యార్థినులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు క్రీడల్లో పాల్గొనాలని ఎంఈఓ సూచించారు. కళాశాల అధ్యాపకులు, పీఈటీ షాషా, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ఆర్డీటీ సహకారం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హాలహర్వి: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అనంతపురం రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గూళ్యం జెడ్పీహెచ్ఎస్‌లో 50 సైకిళ్లను 30 మంది బాలురకు, 20 మంది బాలికలకు పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతాలైన అమృతాపురం, సిద్ధాపురం, జె.హొసళ్లి గ్రామాల నుంచి గూళ్యం పాఠశాలకు వస్తున్న పిల్లలకు రూ.3,75,000 ఖర్చుతో సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. సైకిళ్ల పంపిణీపై విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలూరు ఏరియా ఏటీఎల్ హనుమంతప్ప, హెచ్ఎం గోపి, ఉపాధ్యాయులు, సీఎంసీ చైర్మన్ ఎస్.లింగప్ప, కె.శేఖన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న దేవా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

కోసిగి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందని జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.బెళగల్ గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా దొడ్డి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నరసన్న, బెళగల్ గ్రామంలో మల్లికార్జున గౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. గ్రామంలో సచివాలయ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును, దొడ్డి గ్రామంలో రూ.3లక్షలతో తాగునీటి ట్యాంకులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, అర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, కోసిగయ్య, నాయకులు ఈరన్న గౌడ, వగ్రి నరసప్ప, రవి గౌడ, సూర్యకాంత్ రెడ్డి, రంగారెడ్డి, బజారి,భీమయ్య, మండల ఎంఎల్ఓ హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కారు..

ఆదోనిటౌన్: 14 యేళ్ల టీడీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబునాయుడు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని తుంగలో తొక్కి ప్రజలను నట్టేట ముంచింది కాదని.. మళ్లీ ఇప్పుడు గ్యారెంటీల పేరుతో కొత్త నాటకానికి తెర తీశారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, చైర్‌పర్సన్ బోయ శాంత, కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్ విమర్శించారు. ప్రజా సంక్షేమమే తమ పార్టీ సిద్ధాంతమని చెప్పుకునే టీడీపీ నేడు ప్రజాదరణ కోల్పోయి దివాళా స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం పట్టణంలోని 14వ వార్డు చిన్నమార్కెట్ ఏరియాలోని సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరణ, ర్యాలీ, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు, ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. పేదలను లక్షలాధికారులను చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వార్డు ఇన్‌చార్జ్ మలేకర్ గోవిందు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, నాయకులు మాలిక్, ఎజాజ్, అక్బర్,యల్లప్ప, ముత్తయ్య, సంధ్య, ఖాజా, అన్ను, సందీప్, మునిస్వామి, లోకేశ్వరిబాయి పాల్గొన్నారు.

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, నాయకులు నరసింహుడు, పక్కిరయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిరుతపల్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్‌బీకేలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. నాయకులు నాగిరెడ్డి, తిమ్మారెడ్డి, బంగారయ్య, హనుమంతు, మహదేవ పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల తనిఖీ

ఆదోనిరూరల్: పట్టణంలోని 11 ప్రభుత్వ మద్యం దుకాణాలను కర్నూలు ఎక్సైజ్ సీఐ పద్మావతి బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించి, స్టాకు వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని బీఎన్ టాకీస్ వద్ద ఉన్న షాపులో మద్యం బాటిళ్లను సిబ్బంది యువరాజు, చిరంజీవి, శేఖర్ అక్రమంగా తరలించినట్లు వెల్లడైందన్నారు. అందుకు సంబంధించి రూ.74,880 మొత్తం తేడా వచ్చిందని, విచారణ చేపట్టి ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశామని, ఈ నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోనిఅర్బన్: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని బీజేపీ ఆదోని అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అధ్యక్షతన అసెంబ్లీ పరిధిలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి, నూతనంగా ఎన్నికైన అసెంబ్లీ కన్వీనర్‌లను సన్మానించారు. రాష్ట్ర అన్యభాషా కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర నాయకులు విఠ్ఠా రమేష్, జిల్లాప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు మహాదేవ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



చిన్నమార్కెట్ ఏరియాలో ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: నవరత్నాల పథకాలతో ప్రతి పేద కుటుంబానికి చేయూతనందించడం జరిగిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 14వ వార్డు చిన్నమార్కెట్ ఏరియాలో ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, ఇచ్చిన హామీలను అమలు చేసి జగనన్న రాజకీయాల్లో నూతన చరిత్ర సృష్టించారన్నారు. అర్హులందరికీ పథకాలు అందజేసిన జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని కోరారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ రామలింగేశ్వరయాదవ్, సీనియర్ నాయకులు సన్ని, శ్రీనివాసరెడ్డి, నారాయణ, అజీం, ఈశ్వర్, మల్లికవ్వ, చలపతి, జిలేకాబీ, వైస్ చైర్మన్ నరసింహులు, జిలానీ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



పథకాల గురించి వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని, వాటిని రాష్ట్రంలో ఓ యజ్ఞంలా అమలు చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సాదాపురం, ఉవ్వనూరు గ్రామాల్లో ఎంపీడీఓ గీతావాణితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి గడపను సందర్శించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. మరికొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.3 లక్షలు వరకు లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.18.52 కోట్లు ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. సీతారామ్‌నగర్, చైతన్యనగర్‌లో పంచాయతీ నిధులు రూ.1.50 కోట్లతో డ్రెయినేజీ, సీసీ రోడ్లు వేయించామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి వేసేందుకు పంచాయతీ జనరల్ ఫండ్స్ రూ.కోటితో పైపులైన్ వేయించామని, అలాగే.. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తాను పట్టించుకోనని, వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసునని చెప్పారు. వాస్తవాలు తెలియకుండా ఎల్లో మీడియా వార్తలతో ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నాగమల్లయ్య, రమేష్, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, మండల కో–ఆప్షన్ మెంబర్ వరదరాజస్వామి, వ్యాసూరు రాఘవులు, మండల అధ్యక్షులు గురునాథ్‌రెడ్డి, నాయకులు నకేతేశ్యామ్, శేషిరెడ్డి, కల్పవల్లి, మురళి, వీరేష్, గోవిందు, రమేష్, వీరాంజనేయులు, నల్లారెడ్డి, గిడ్డయ్య, వినోద్‌రెడ్డి, రాముడు, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

వరద కాల్వ నిర్మాణంతో వలసల నివారణ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కౌతాళం: తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మాణం చేపడితే వలసల నివారణ సాధ్యం కాగలదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మల్లయ్య తెలిపారు. వలసల నివారణ, తుంగభద్ర దిగువ కాలువకు డిసెంబర్ చివరి వరకు సాగునీరు, కరువు సహాయ చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈఏడాది ప్రారంభంలో వర్షాలు బాగా కురిసినప్పటికీ.. సెప్టెంబర్, అక్టోబరులో వానలు లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలో ఉపాధి కూలీలకు రెండు వందల రోజుల పనులు కల్పించాలని, రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. శాశ్వత కరువు, వలసలు నివారణకు మేళిగనూరు వద్ద తుంగభద్ర నదిపై వరదకాలువ నిర్మించి రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు రామలింగ, రామాంజనేయులు, రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, నాగేంద్ర, సీపీఐ నాయకులు ఈరన్న, కేవీపీఎస్ నాయకులు మారయ్య, బసవ, కౌతాళం సింగల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు వెంకటపతిరాజు, ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ అధ్యక్షుడు చెన్నబసప్ప పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నందవరం: మండల కేంద్రంలో వినాయక, శబరిమల అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్య విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగింది. పురోహితులు కోటేకల్ పరమేశప్ప స్వామి ఆధ్వర్యంలో శిష్య బృందం (గురు స్వాములు) ఘనంగా ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. మూడు రోజుల నుంచి విగ్రహాలకు జల, ధాన్య, దీక్షహోమాలు, కూష్మాండ బలిదానం, ప్రాణ ప్రతిష్ఠాపన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బుధవారం ఉదయం వినాయక, అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్య, నాగప్ప, నవగ్రహాలు, అభయ అంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పురోహితులు విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామికి భక్తులు, గ్రామస్తులు పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రతి ఇంట్లో ఆడపడుచులకు చీర, జాకెట్ పెట్టి ఒడి బియ్యం పోసి దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



పట్టుబడిన నాటుసారా, రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

పెద్దకడబూరు : సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం నిర్దేశించుకున్నామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పేర్కొన్నారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రికార్డులు సరిగా లేని 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పచ్చని పల్లెల్లో గొడవలు సృష్టిస్తే సహించేదే లేదని హెచ్చరించారు. గ్రామంలో అధికంగా నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఇప్పటికైనా మానుకోవాలని సూచించారు. కోసిగి సీఐ ఎరిషావలి, మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, పెద్దకడబూరు ఎస్ఐ మహేష్‌కుమార్, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి, మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్, కోసిగి ఎస్ఐ సతీష్, ఎమ్మిగనూరు ట్రాఫిక్ ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాలను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఆదోనిరూరల్: డిసెంబర్ 15, 16, 17వ తేదీల్లో కర్నూలులో జరుగుతున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన ప్రజా సంఘాల కార్యకర్తల సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో, ఎరువుల ధరలు, బ్యాంకు రుణాల మాఫీ చేయడంలో ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ పదేళ్ల కాలంలో బడా కార్పొరేట్లకు రూ.14 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం, రైతుల అప్పుల గురించి మాత్రం మాట్లాడటం లేదని మండిపడ్డారు. మరోపక్క జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడినా ఇప్పటి వరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం కోసం వేలాది మంది రైతులతో డిసెంబర్ 15 నుంచి కర్నూలు నగరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, అయ్యప్ప, సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు జె.రామాంజనేయులు, వీరారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

ఆలూరు రూరల్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని కర్నూలు జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్ సూచించారు. ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ గౌరవ దివస్ ఉత్సవాల్లో ఆలూరు గిరిజన సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన గౌరీబాయ్ బంజారా నృత్యంలో ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా బుధవారం ఆ పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ విద్యార్థినికి పురస్కారం అందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర అంశాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ షాహినూర్, హెచ్ఎం జమ్మన్న, వైస్ ప్రిన్సిపాల్ రంగబాబు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: దేవనకొండను కరువు మండలంగా ప్రకటించినప్పటికీ సహాయక చర్యలు చేపట్టకపోవడంపై సీపీఐ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటిశెట్టి, మండల కార్యదర్శి నరసారావు, సి.కృష్ణ మాట్లాడుతూ పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

జీవితంపై విరక్తి చెంది..

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వాల్మీకీ నగర్‌కు చెందిన బోయ చిన్న రంగన్న(55) జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. బుధవారం ఆదోని–ఇస్వీ ఆర్ఎస్ఎస్‌ల మధ్య నట్టిగేట్ సమీపంలోని కి.మీ. నంబర్ 495/29 అప్ లైన్ ట్రాక్ వద్ద ట్రైన్ నంబర్. 16339 కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బోయ చిన్న రంగన్న హమాలీ పనిచేసుకుని కుటుంబాన్ని పోషించుకొనేవాడని, అయితే పనికి వెళ్లకుండ ఇంటి పట్టునే ఉంటుండటంతో.. ఇలా ఉంటే ఇల్లు ఎలా గడుస్తుందని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

13 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వ

హొళగుంద: ఉమ్మడి జలాశయం, కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో బుధవారం 13.621 టీఎంసీలకు నీటిమట్టం పడిపోయింది. డ్యాంలో నీటి చేరిక (ఇన్ ఫ్లో) అంతగా లేకపోవడం, కొన్ని నెలలుగా వివిధ కాలువలకు నీటిని వదులుతుండడంతో నిటి నిల్వ వేగంగా తగ్గుతోంది. బుధవారం 1593 అడుగుల వరకు నీరు ఉన్నాయి. డ్యాం నుంచి 5,467 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు వదులుతున్నారు. గతేడాది ఇదే సమయానికి 92 టీఎంసీల నీటితో జలాశయం కళకళలాడుతుండేది. ఇక ఎల్లెల్సీ ఆంధ్రాలో 250 కి.మీ వద్ద 771 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

నిత్యావసర సరుకుల అందజేత

దేవనకొండ: గత సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధమై నిరాశ్రయులైన ఎద్దు రామాంజనేయులు కుటుంబానికి దేవనకొండ వైఎస్సార్‌సీపీ నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతిఒక్కరినీ ఆదుకోవాలనే లక్ష్యంతో సీఎం జగనన్న చూపిన మార్గంలోనే తనవంతుగా సాయం చేసినట్లు తెలిపారు. పీఏసీసీ సిబ్బంది, కరివేముల ఎల్‌కే శీను, మండల నాయకులు ఉన్నారు.

అధిక సాంద్రత పద్ధతి లాభదాయకం

ఆలూరు: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి అనుసరిస్తే లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి శాస్త్రవేత్త రమేష్‌నాయక్ రైతులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏఓ వెంకటేష్ గౌడు సమక్షంలో వివిధ గ్రామాల రైతులకు పత్తిలో లాభదాయక సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. తగిన మోతాదులో సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఏడీఏ సునీత తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న సివిల్ సప్లయి మేనేజర్ షర్మిలమ్మ

ఆలూరు: రైతులు పండించిన జొన్నలు, కొర్రలు, రాగులు, సజ్జలు ఇతర చిరుధాన్యాలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ షర్మిలమ్మ పేర్కొన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏడీఏ సునీత సమక్షంలో బుధవారం చిరుధాన్యాలు సాగుచేసిన రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మాల్‌దండ్ రకం జొన్నలు క్వింటం రూ.3,200, హైటెక్ మహేంద్ర రకం రూ.3,100, కొర్రలు క్వింటాలుకు రూ.3,846 ప్రకారం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో జొన్న పంట 260 హెక్టార్లు, 400 హెక్టార్లలో సజ్జ, 95 హెక్టార్లలో కొర్ర పంటలను రైతులు సాగు చేసినట్లు చెప్పారు. దిగుబడులను విక్రయించేందుకు రైతులు ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలని ఏడీఏ సునీత తెలిపారు. ఏఓలు వెంకటేష్ గౌడు, మల్లికార్జున, సివిల్ సప్లయి డీటీ రఘురామిరెడ్డి, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరురూరల్: 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దామని మండల ప్రత్యేకాధికారి విజయకుమార్, తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాకారులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలన్నారు. గ్రామ, మండల, తాలుకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ స్థాయిలో చదువుకున్న, చదువుకోని వారైనా క్రీడల్లో ప్రావీణ్యం ఉంటే గుర్తించి పేర్లు నమోదు చేసి క్రీడల్లో పాల్గొనేలా చూడాలని చెప్పారు. క్రీడా మైదానాలు లేని గ్రామాల్లో దగ్గర్లో ఉండే క్రీడా మైదానాలను గుర్తించి ఆటపోటీలను నిర్వహించాలని ఆదేశించారు. క్రీడాకారుల గుర్తింపులో అలసత్వం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ బంగారమ్మ, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంఈఓ–2 మదుసూధన్‌రాజు, పీడీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.